# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 311 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 24 -12 -2024 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## మాజీ ప్రధాని పీవీకి సీఎం ఘన నివాళులు

సీఎం నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు.

హైదరాబాద్‌డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

భారతదేశ మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సోమవారం పీవీ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశానికి పీవీ చేసిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డితో పాటు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి తదితరులు -మిగతా 2 లో

# బ్యాంకర్లు సహకరించాలి

- వ్యవసాయ రుణాల పంపిణీలో వేగం పెంచండి
- పారిశ్రామిక రుణ లక్ష్యాలను అధిగమించండి
- సంక్షేమ రంగాలకు నిధులిస్తాం
- రాబోయే రోజుల్లో వైబ్రెంట్ తెలంగాణ
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క






హైదరాబాద్‌డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకులు వేగం పెంచాలని సూచించారు. 2024 ఖరీఫ్ సీజన్లో రూ.54,480 కోట్ల రుణాలు లక్ష్యం కాగా రూ.44,438 కోట్లు (81.57 శాతం) విడుదల చేశారని తెలిపారు. రబీ రుణాల పంపిణీకి నెలరోజుల -మిగతా 2 లో



## 30న మంత్రివర్గ సమావేశం

- రైతు భరోసా విధి విధానాలపై చర్చ
- సంక్షేమ, అభివృద్ధి పథకాల నిధుల సమీకరణపై కసరత్తు

హైదరాబాద్‌డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

డిసెంబరు 30న తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ -మిగతా 2లో



## అల్లు అర్జున్‌కు నోటీసులు

- నేడు చిక్కడపల్లి పీఎస్‌కు రావాలని ఆదేశం

హైదరాబాద్

సినీనటుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. డిసెంబరు 4న 'పుష్ప 2' -మిగతా 2 లో

మిషన్ భగీరథ
ఇంటింటికి తాగునీరు, ఇల్లాలి కష్టాలు తీరు

## భగీరథకు టోల్ ఫ్రీ

తాగునీటి సమస్యలపై 1800-599-4007 నెంబరుకు కాల్ చేయండి

తొలిరోజు తొమ్మిది ఫిర్యాదులు

-హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి సర్కారు ముందడుగేసింది. వేసవికి మూడు నెలల ముందుగా స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా -మిగతా 2 లో

# సీఎం రేవంత్‌ను.. ప్రశ్నిస్తే పగబడుతుండు..!



- అసెంబ్లీలో అడిగితే అదరగొడుతుండు
- ముఖ్యమంత్రి గన్‌మెన్ లేకుండా మెదక్ జిల్లాలో తిరగగలరా
- కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దారుణం
- ముఖ్యమంత్రి అంటే కొంచెం ఇజ్జత్, సిగ్గు ఉండాలి
- రైతు బోనస్ రావాలంటే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి
- మెదక్ విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు

మెదక్‌డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశ్నిస్తే పగబడుతున్నాడని, అసెంబ్లీలో మైక్ ఇవ్వకుండా అదరగొడుతున్నట్టు మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలతో కలిసి సోమవారం మెదక్‌లోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఒక్క -మిగతా 2 లో



## అమిత్ షా రాజీనామా చేయాలి

-అంబేద్కర్‌పై వ్యాఖ్యలతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల గుండెల్లో గాయం

- దీపాదాస్ మున్షి

హైదరాబాద్

బీజేపీ నాయకులు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని -మిగతా 2 లో

## ప్రతీకార పాలనకు తెరలేపిన రేవంత్

- కాంగ్రెస్, బీజేపీ భాయీ భాయీ
- ప్రజల దృష్టి మళ్లించడానికే తెరమీదికి అల్లు అర్జున్ వ్యవహారం
- మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రివేంజ్ సీఎంగా మారి రివర్స్ పాలిటిక్స్ నడుపు తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. ప్రతీకార రాజకీయాలే లక్ష్యంగా ప్రతిపక్షాలను అణగదొక్కడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో -మిగతా 2 లో

# బ్యాంకర్లు సహకరించాలి

(మొదటి తరువాయి)

సమయమున్నందున మరింత వేగం పెంచడం ద్వారా 100 శాతం లక్ష్యం సాధించాలని కోరారు. రాష్ట్రంలో బ్యాంకర్ల రీపేమెంట్ పెరిగిందనీ, అదే సందర్భంలో రుణాల మంజూరు తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సహజ ఆర్థిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విధానం నుంచి బయటపడాలని బ్యాంకర్లకు సూచించారు. రెండు నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్లు రైతు రుణమాఫీ కింద బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని గుర్తు చేశారు. టర్మ్ లోన్ల విషయంలో లక్ష్యానికి మించి పని చేయడం పట్ల బ్యాంకర్లను ఆయన అభినందించారు. అదే సందర్భంలో ఆయిల్ ఫామ్, తదితర రుణాల విషయంలో ఉదారంగా ఉండాలని కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎమ్ఈ) పరిశ్రమల రుణ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్పొరేట్ కంపెనీలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడం మూలంగా కొద్ది మంది చేతిలో ఆర్థిక వ్యవస్థ కేంద్రీకృతమవుతుందనీ, ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరుగుతాయని గుర్తు చేశారు. పెద్ద మొత్తంలో ఉపాధి, వస్తువులను ఉత్పత్తి చేస్తున్న ఎంఎస్ఎమ్ఈ రంగానికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. మహిళల ను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 20 వేల కోట్ల వడ్డీలేనీ రుణాలు అందించడం ద్వారా రాబోయే ఐదేండ్లలో కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని అన్నారు. ఈ పథకానికి బ్యాంకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందనీ, గ్రీన్ పవర్ ఉత్పత్తికి బ్యాంకర్లు పెట్టుబడులు సమకూర్చాలని కోరారు. విస్తృతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాబోయే రోజుల్లో వైబ్రెంట్ తెలంగాణను చూస్తారని అన్నారు. మూసీ పునర్జీవం ప్రాజెక్ట్, స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఉండే ఫార్మా కంపెనీల నిర్మాణం పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయనీ, త్వరలో టెండర్లు పిలవబోతున్నట్టు తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ద్వారా రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంక్షేమ పథకాల రూపంలో వేల కోట్లు విడుదల చేస్తున్నామని అన్నారు. ఆయా సబ్సిడీ పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ల రూపంలో పెద్ద సంఖ్యలో రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు.

# సీఎం రేవంత్‌ను.. ప్రశ్నిస్తే పగబడుతుండు..!

(మొదటి తరువాయి)



గ్యారంటీని అమలు చేయలేదని విమర్శించారు. రుణమాఫీపై అంతా అయిపోయిందనుకుంటున్న ముఖ్యమంత్రి గన్‌మెన్ లేకుండా మెదక్ జిల్లాలో తిరగగలరా అని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి అంటే కొంచెం ఇజ్జత్, సిగ్గు ఉండాలని, కానీ రేవంత్ రెడ్డికి అవి ఏమీ లేవని అన్నారు. వందేండ్ల చరిత్ర కలిగిన మెదక్ చర్చికి పోయి ఒట్టు వేసి చెప్పాడని ఎద్దేవా చేశారు. రుణమాఫీపై బ్యాంకర్ల మీటింగ్‌లో రూ.49 వేల కోట్లు అని చెప్పి బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు ఇచ్చిండన్నారు. పొద్దున దినపత్రికల్లో రైతుల ఆత్మహత్యలు చూస్తుంటే మనసంతా కలిచి వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. చివరి గింజ వరకు కొంటామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారని, కానీ 18 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొన్నారని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతు బోనస్ రావాలంటే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథకు టోల్ ఫ్రీ

(మొదటి తరువాయి)

పరిష్కరించే ప్రయత్నం చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ, తాజాగా టోల్‌ఫ్రీ నెంబరును కేటాయించింది. పల్లెల్లో తాగునీటి ఇబ్బందులు ఉంటే 1800-599-4007 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించింది. ఇందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఎస్‌ఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందాన్ని పర్యవేక్షణ కోసం నియమించింది. సోమవారం నుంచే ఈ టోల్ ఫ్రీ నెంబరు అమల్లోకి వచ్చింది. తొలి రోజు ఆయా జిల్లాల నుంచి తొమ్మిది ఫిర్యాదులు అందాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులు, సమస్యలపై ఎప్పటికప్పుడు సర్కారు దృష్టికి తీసుకుపోయే అవకాశం కలిగింది. 24గంటల పాటు కాల్ సెంటర్ పనిచేయనుంది. పగటిపూట వచ్చే ఫోన్ కాల్స్‌ను భగీరథ కార్యాలయం సిబ్బంది అటెండ్ చేసి వివరాలు నమోదు చేసుకుంటారు. రాత్రి వచ్చే కాల్స్ రికార్డు అవుతాయి. ప్రతిరోజూ వచ్చే ఫిర్యాదులను మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కపాకర్‌రెడ్డి సమీక్షించి 24 గంటల్లో సమస్య పరిష్కారమ య్యేలా చర్యలు తీసుకుం టారు. టోల్ ఫ్రీ ద్వారా అందే ఫిర్యాదులను క్షేత్ర స్థాయికి చేరవేసి పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తారు. అంతేగాక రాష్ట్ర కార్యాలయం సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉంటారు. పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సైతం పలుమార్లు సమీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరమే టోల్‌ఫ్రీ ఆలోచ న చేసినట్టు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపా యి. మిషన్ భగీరథ నీటిపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టను న్నారు. నీటి సరఫరాలో లీకేజీలు, ఆటంకాలను అరికట్టే లక్ష్యంగా టోల్‌ఫ్రీని ఏర్పాటు చేశారు. ఫిర్యాదుల స్వభావం ఆధారంగా కీలక నిర్ణయా లు తీసుకునే అవకాశం కనిపిస్తున్నది. తాగునీటి సరఫరా సజావుగా సాగేలా చూసేందుకు గ్రామాల్లో మంచినీటి సహాయకుల నియామకం చేయనున్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తక్షణం రంగంలోకి దిగి మరమ్మతులు చేసేలా సహాయకులకు పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. మిషన్ భగీరథ సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. 64,218 చేతి పంపులు, 45,882 సింగల్ ఫేజ్ మోటార్లు, 32,517 పైపులకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవడానికి మిషన్ భగీరథ శాఖ కృషి చేస్తున్నది. తాజాగా మిషన్ భగీరథలో కాల్‌సెంటర్ ఏర్పాటుతో గ్రామీణ నీటిసరఫరా సమస్యలకు చెక్ పడే అవకాశాలు ఉన్నాయి.

# ప్రతీకార పాలనకు తెరలేపిన రేవంత్

(మొదటి తరువాయి)

ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ దాన్ని బీజేపీ నడిపిస్తున్నదని విమర్శించారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ పెద్దలను కలిసిన తర్వాతే కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదైందనీ, ఆ మరునాడే ఈడీ కేసు నమోదు చేసిందని గుర్తు చేశారు. ప్రాంతీయ పార్టీలను కనుమరుగు చేయాలన్నది కాంగ్రెస్, బీజేపీల లక్ష్యమని తెలిపారు. దేశంలో బలమైన ప్రాంతీయ పార్టీకి నాయకునిగా ఉన్న కేసీఆర్ వంటి నేతలను దెబ్బకొట్టేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలకిచ్చిన హామీలు, సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే అల్లు అర్జున్ వ్యవహారాన్ని ప్రభుత్వం తెరమీదికి తీసుకొచ్చిందని అన్నారు. రాష్ట్రంలో 10 శాతం కమిషన్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. మెఘా కృష్ణారెడ్డి వంటి వారి కంపెనీలకు వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లిస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్, పేదల సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు మాత్రం నిధులు విడుదల చేయక పోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గురుకులాల్లో విషాహారం తిని మరణించిన 57 మంది పిల్లల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున





నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాకపోవడం వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భూభారతితో భూభద్రత ఉండబోదనీ, ఈ చట్టాన్ని తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను నాశనం చేస్తున్నదని విమర్శించారు. ధరణిపై విషప్రచారం చేశారనీ, ప్రజలు తిరిగి ఆ వ్యవస్థనే కావాలని ఉద్యమించే పరిస్థితి వస్తుందని తెలిపారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దాన్ని అడ్డుకునేందుకు గ్రామ గ్రామానా ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్టిస్తామని పునరుద్ఘాటించారు. తెలంగాణ జాగృతి, బీఆర్ఎస్ పార్టీ వేరు వేరు కాదనీ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు కలిసే పని చేస్తాయని స్పష్టం చేశారు.

# మాజీ ప్రధాని పీవీకి సీఎం ఘన నివాళులు

(మొదటి తరువాయి)

పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

కాగా వరంగల్ జిల్లాకు చెందిన పీవీ ఈ దేశానికి తొమ్మిదవ ప్రధానమంత్రిగా సేవలు అందించారు. ఆయన కేంద్ర ఆర్థిక మంత్రిగా పని చేసిన సమయంలో ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడారని తెలిపారు.

## భూసంస్కరణలకు ఆద్యుడు : మల్లు భట్టి విక్రమార్క

మాజీ ప్రధానమంత్రి పీ.వీ.నర్సింహారావు భూసంస్కరణలకు ఆద్యులని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పీవీ వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ భూ సంస్కరణలు దేశచరిత్రలో ఒక విప్లవాత్మక చర్య అని అభివర్ణించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంతో పోటీ పడేలా చేసిన ఘనత పీవీదేనని తెలిపారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా పీవీ పాలన నేటికి ఆదర్శమన్నారు. పీవీ తెలంగాణలో జన్మించడం మనందరికీ గర్వకారణమన్నారు.

## పీవీ కాంగ్రెస్ పార్టీ ఆస్తి : మహేశ్ కుమార్ గౌడ్

భారత రత్న, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కాంగ్రెస్ పార్టీ ఆస్తి అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పీవి నరసింహరావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయన సోమవారం పీవీ జ్ఞానభూమి వద్ద పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల పితామహుడు , అపర చాణక్యుడు, బహుభాషా వేత్త, గొప్ప సంస్కరణశీలి, మేధావి పీవీ నరసింహారావు చరిత్రను దేశం ఎన్నటికీ మర్చిపోద న్నారు.దివాలా అంచున ఉన్న ఆర్థిక వ్యవస్థను కాపాడిన గొప్ప ఆర్థిక వేత్త పీవీ అని చెప్పారు

# 30న మంత్రివర్గ సమావేశం

(మొదటి తరువాయి)

విధివిధానాలపై చర్చించే అవకాశముంది. భూమిలేని పేదలకు నగదు బదిలీ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు అంశాలు కూడా చర్చకు వచ్చే అవకా శముంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ భేటీలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. రైతుభరోసా విధి విధానాలతో పాటు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు, అవినీతి ఆరోపణలపై కొనసాగుతోన్న విచారణలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

# అల్లు అర్జున్‌కు నోటీసులు

(మొదటి తరువాయి)

ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రశ్నించనున్నారు. అయితే ఈ తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందగా ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 18 మందిపై కేసు నమోదు చేశారు. అందులో అల్లు అర్జున్ 11వ నిందితుడిగా ఉన్నారు. డిసెంబరు 13న ఆయనను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. అనంతరం రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో అల్లు అర్జున్‌కు మరోసారి నోటీసులు జారీ చేసిన పోలీసులు.. తొక్కిసలాట ఘటనపై మరింత లోతుగా విచారించే అవకాశముంది..

# అమిత్ షా రాజీనామా చేయాలి




(మొదటి తరువాయి)

గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తదితర నాయకులతో కలిసి ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆ వ్యాఖ్యలతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల గుండెల్లో గాయమైందన్నారు. ఇది కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల విషయం కాదనీ, ఆ వర్గాలు అంబేద్కర్‌ను దేవుడిగా భావిస్తున్నాయని చెప్పారు. తక్షణం అమిత్ షా రాజీనామా చేసి ప్రజలను క్షమాపణ కోరాలన్నారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా 'అంబేద్కర్ సమ్మాన్ సప్తాహ" నిర్వహిస్తున్నాం. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్‌లో, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి, అమిత్ షాని బర్తరఫ్ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్లను కలుస్తామని చెప్పారు.

బీజేపీ రాజ్యాంగాన్ని తొలగించాలనుకుంటున్నదని అమిత్ షా వ్యాఖ్యలతో మరోసారి బట్టబయలైందని విమర్శించారు. అవినీతిపై చర్చించమంటే దారి మళ్లించేలా ఇలాంటి అంశాలు మాట్లాడుతున్నారని తెలిపారు. దేశమంతటా తల మీద మానవ వ్యర్థాలు మోసే విధానం పోవాలని కోరుతుంటే 2010లో సామాజిక్ సంరస్థ పుస్తకంలో ఆ విధానం కొనసాగాలని పీఎం నరేంద్రమోడీ రాశారని ఆరోపించారు. అందులో ఎస్సీలను మానసిక వికలాంగులుగా అభివర్ణించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక సమానతను కోరిన అంబేద్కర్‌ను క్రాంతికిరణ్ కాదంటూ పేర్కొన్నారని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై తాము నిలదీస్తే అదంతా రాజకీయమంటూ తప్పించుకున్నారని రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనలను గుర్తుచేశారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు అత్యున్నత వ్యవస్థ అని తెలిపారు. రాహుల్ గాంధీ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా హత్యాయత్నం కేసు నమోదు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు మాట్లాడుతూ దేశ పౌరులు అంబేద్కర్‌ను దేవునిగా చూస్తుంటే ఆ దేవునిపై అమిత్ షా ద్వేషంతో మాట్లాడారని విమర్శించారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిదంటూ ప్రధాని మోడీ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. అంబేద్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మెన్‌గా ఎన్నుకున్నది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ చేసిన రాజ్యాంగ సవరణలు పేద ప్రజలకు ఉపయోగపడ్డాయని తెలిపారు

## తెలుగు పంచాంగం 24/12/2024, మంగళవారం

సమయ సమాచారం:
సూర్యోదయం: 6:46 AM
సూర్యాస్తమయం: 5:44 PM
తిథి:
నవమి: 5:08 PM (డిసెంబర్ 23) నుండి 7:52 PM (డిసెంబర్ 24)
దశమి: 7:52 PM (డిసెంబర్ 24) నుండి 10:46 PM (డిసెంబర్ 25)
నక్షత్రం:
హస్త: 9:09 AM (డిసెంబర్ 23) నుండి 12:17 PM (డిసెంబర్ 24)
చిత్రా: 12:17 PM (డిసెంబర్ 24) నుండి 3:28 PM (డిసెంబర్ 25)
శుభ ముహూర్తాలు:
అభిజిత్ ముహూర్తం: 11:53 AM నుండి 12:37 PM
అశుభ ముహూర్తాలు:
రాహు కాలం: 2:55 PM నుండి 4:17 PM
యమగండం: 9:31 AM నుండి 10:53 AM

# అయ్యప్ప స్వాములకు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ(బిక్ష)





షాద్ నగర్ డిసెంబర్ 23 ( నీలగిరి ఎక్స్ ప్రెస్

శ్రీ శివమారుతీ అయ్యప్ప దేవాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి కూతురు నెల్లి సాత్విక జన్మదినం సందర్భంగా ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ....అయ్యప్ప స్వాములకు సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టమని,అయ్యప్ప స్వాములు మాల వేసుకున్న నాటి నుంచి దైవ చింతనలో, స్వామి భజనలతో సమయం గడుపుతూ.. సాత్విక జీవనం అవలంభించుకుంటారని అన్నారు. అయ్యప్ప స్వామి వారి కృపాకటాక్షాలు షాద్ నగర్ నియోజకవర్గం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. తదనంతరం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమం లో ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, వెంకటేష్ గుప్త, చెంది మహేందర్ రెడ్డి, శేరి విష్ణువర్ధన్ రెడ్డి, ప్యాట అశోక్,వంశీ కృష్ణ, గురు స్వామి మల్చలం మురళి, హరి భూషణ్, చెట్ల వెంకటేష్,రణధీర్ గౌడ్ , హరీష్, మల్చలం రాము, గజ్జల ప్రవీణ్, కుడుముల బాలరాజు, సాయి గౌడ్, జె నర్సింహా, బాల్ రెడ్డి, రంగన్న, విజయ్ కుమార్, గుంత సత్యనారాయణ, వివేక్, శంకర్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎండీని కలిసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



షాద్ నగర్,డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్ ప్రెస్):
షాద్ నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ సోమవారం హైదరాబాద్ నీ ప్రధాన కార్యాలయంలో టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ మరియు మెనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ముషరఫ్ అలీ ఫరూకీని కలిసి షాద్ నగర్ నియోజకవర్గంలో పలు విద్యుత్ సమస్యలపై, ఎలక్ట్రిసిటీ సిబ్బంది కొరత, నూతన సబ్‌స్టేషన్ ఏర్పాట్లపై , బడ్జెట్ కేటాయింపుల పై చర్చించారు. అతి త్వరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తానని సీఎండీ, తెలిపారు.

# ఆమనగల్ రైతువేదికలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



ఆమనగల్, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఆమనగల్ రైతు వేదిక వద్ద కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వసంత, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్ హాజరై ఎనిమిదో వార్డు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు.ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి పాటుపడుతామని తెలిపారు.

# స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**–ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్, జర్పుల రాధకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ గంప లక్ష్మయ్య గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం విజయవంతం**



కడ్తాల్ డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కల్వకుర్తి నియోజకవర్గంలో స్వచ్ఛంద సంస్థలు నిరుపేదల కోసం అందిస్తున్న పలు సేవలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయకులు అన్నారు. మండల పరిధిలోని కర్కల్ పహాడ్ గ్రామంలో ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ గంప లక్ష్మయ్య గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో గంప వెంకటేష్ గుప్తా, జరుపుల దశరథ్ నాయక్, లచ్చిరాం నాయక్, మాజీ సర్పంచ్ ఎంకోబా, డాక్టర్ ఉప్పల అఖిల్, డాక్టర్ ఉప్పల అనిల్, డాక్టర్ భావనలతో కలిసి వారు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కడ్తాల్ మండలంలో స్వచ్ఛంద సంస్థలు పేదవారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈకార్యక్రమంలో యాదయ్య, మహేష్ ,మైలారం రాజు, అర్జున్, బుచ్చిబాబు, వగ్గు మహేష్, సూరిగిమల్ల శేఖర్, తుడుం శ్రీశైలం, ఈరయ్య, శ్రీను, వెంకటయ్య, వడ్డే విరయ్య, నరేందర్, గ్రామ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**–లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



కడ్తాల్, డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం గొప్ప వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేదింటి ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను రూపుమాపేందుకు కళ్యాణలక్ష్మి, షాదీమురక్ పథకాలతో ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ముంతాజ్బేగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు మంజూరైన పేదింటి ఆడపడుచులకు ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులతో కలిసి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో అమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ ముదిరాజ్, వైస్ చైర్మన్ గుడురు భాస్కర్ రెడ్డి, తహసిల్దార్ ముంతాజ్ బేగం, ఎంపిడిఓ సుజాత, టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ నరేష్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ డ్డి, డిసిసి కార్యదర్శి బిక్య నాయక్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నరసింహ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్చనాయక్, ప్రభాకర్ రెడ్డి, అద్దాల రాములుగౌడ్, పోతుగంటి అశోక్, రాజేష్, రామచంద్రి నాయక్, జంగిర్ అలీ, యాదగిరి రెడ్డి, శేఖర్ గౌడ్, సుమన్, మలెమల్లేష్ గౌడ్, రామకృష్ణ, శబ్బు, రామచంద్రినాయక్, హీరాసింగ్, పట్టణ, మండల పార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ సారూ కడ్తాల్ గ్రామ రైతులను
# విద్యుత్ వలయాల నుండి కాపాడండి

**మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి**



కడ్తాల్,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్):తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫోర్త్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న కడ్తాల్ గ్రామం మీదుగా విద్యుత్ హై టెన్షన్ వైర్లు ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని మాజీ సర్పంచ్ గ్రామ రైతులతో కలిసి కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో కలెక్టర్ ను కలిసి ఇప్పటికే కడ్తాల్ గ్రామ సరిహద్దుల గుండా 220/400/765 సాంద్రత కలిగిన హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఐదు మార్గాల గుండా ఏర్పాటు చేయడంతో ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈ క్రమంలో బీదర్ – మహేశ్వరం పవర్ గ్రిడ్ ట్రాన్స్మిషన్ వారు ఏర్పాటు చేస్తున్న మరొక కొత్త 765 KV పవర్ లైన్ ఏర్పాటుతో కడ్తాల్ పరిధిలో మిగిలి ఉన్న వ్యవసాయ పొలాల రైతులు పూర్తిగా నష్టపోనున్నట్లు కలెక్టర్ కు వివరించినట్లు తెలిపారు. విద్యుత్ లైను ఏర్పాటుకు సంబంధించిన కాంట్రాక్టర్లు ఆయా ప్రాంత రైతులకు, పట్టాదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మరియు విద్యుత్ చట్టం 2003లోని కనీస ప్రామాణికాలు పాటించకుండా, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని కలెక్టర్ కు రైతులతో కలిసి వివరించినట్లు తెలియజేశారు. ఇట్టి విషయమై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ విద్యుత్ ఎస్ఇ పవర్ గ్రిడ్ వారితో చర్చించి రైతులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ ఉపసర్పంచ్ కదారి రామకృష్ణ, రైతులు ఎగిరి శెట్టి గాంధీ, గూడూరు పెంటారెడ్డి, గోరేటి జంగయ్య, మూడ నరసింహ, గూడూరు జంగారెడ్డి, శివరాజ,అభిషేక్ రెడ్డి, సుదర్శన్, బోసు రవి, శివరామకృష్ణ,రమేష్, గూద రాములు, వెంకట్ రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఆదర్శ రైతు అవార్డు గెలుచుకున్న రామకృష్ణ-మౌనిక దంపతులు



యాదగిరిగుట్ట, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో ఆదివారం నిర్వహించిన జాతీయ గాంధీ సుస్థిర జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీతల కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఉత్తమ ఆదర్శ రైతు దంపతులు మౌనిక, రామకృష్ణ లకు ఈ అవార్డును అందజేశారు. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలో గల కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ, మౌనిక దంపతులు ఈ అవార్డును అందుకున్నారు. అధికారులు పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా రామకృష్ణ గారిని ఎంపిక చేసారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం రోడ్లు భవనాలు, సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్పు బీర్లా ఐలయ్య, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కె.వి.యన్. రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నరసింహులు, చైర్మన్ రాజేందర్ రెడ్డి, కన్వీనర్ పావని తదితరులు పాల్గొని అవార్డును అందజేశారు. కె.వి.యన్. రెడ్డి మాట్లాడుతూ, “మా ఊరు బిడ్డలు ఎంపిక చేయడం చాలా గర్వించదగ్గ విషయమని,” అన్నారు. “ఈ అవార్డుకు రామకృష్ణ పేరు ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, కె.వి.యన్. రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు,” తెలుపగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజావాణి కార్యక్రమంలో 92 ఫిర్యాదులు





**రంగారెడ్డి, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని," అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ 57, పిడి హౌసింగ్ - 19, డీపీఓ-07, లోకల్ బాడీస్-03, ఎంపీడీఓ -01, శేరిలింగంపల్లి మున్సిపాలిటీ-01, ఏడి సర్వే ల్యాండ్-02, ఎంప్లాయ్మెంట్ -01, వైద్య ఆరోగ్య శాఖ -01, మొత్తం 92 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది

**-ఆమనగల్ సింగల్ విండో కార్యాలయం వద్ద ఘనంగా రైతు దినోత్సవం**



**ఆమనగల్లు,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రైతు అభివృద్ధి చెందుతేనే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అభిప్రాయపడ్డారు. సోమవారం ఆమనగల్లు సింగల్ విండో కార్యాలయం వద్ద పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ కమటం రాధమ్మ వెంకటయ్యతో కలిసి అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతుల చే కేక్ కట్ చేసి వారికి పంచిపెట్టారు. అనంతరం రైతులను శాలువలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే బీద రైతులను ప్రభుత్వం మరింత చేయూత అందించి ఆదుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతిగా వ్యవహరించి వారి అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుబంధు, పెట్టుబడి సాయం, ఐదు లక్షల ఇన్సూరెన్స్, రుణమాఫీ అందించిన ఘనత గత ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. అదేవిధంగా సింగల్ విండోల ద్వారా రైతన్నలకు సబ్సిడీపై రుణాలు అందించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్లు శ్రీ పాల్, ధోల్యా నాయక్, వెంకటేష్, నాయకులు రైతులు యాదయ్య, జంగయ్య, గన్యా, రూప్ సింగ్, రాజేష్, యాదమ్మ, రాములమ్మ, సీఈఓ దేవేందర్, సిబ్బంది మహేష్, సురేష్, అల్లాజి తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక ధ్యానంతోనే ఆనందమయ జీవితం





**కడ్తాల్, డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్ ప్రెస్): ఆధ్యాత్మిక**



ధ్యానంతోనే ఆనందమయ జీవితం సాధ్యమని, మానసిక ఒత్తిడి దూరమవు తుందని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయ భాస్కర్ రెడ్డి, అన్నారు. సోమవారం పత్రీజీ ధ్యాన యాగం వేడుకల్లో భాగంగా 3వ రోజు ఉదయం 5 గంటల నుంచి 8 : 30, నిమిషాల వరకు సంగీత ధ్యానం, పత్రీజీ విడియో సందేశం, సంగీత వేణునాథ ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. పత్రీజీ ధ్యాన యాగం వేడుకలకు హాజరైన ప్రముఖులకు ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయ భాస్కర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు సన్మానించి మెమోంటోలను బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు రోజుకు ఒక గంట ధ్యానం చేసిన వ్యక్తి ఆనందమయ జీవితం, ఆరోగ్యంగా బ్రతకవచ్చునని, బ్రహ్మాజ్ఞానం తెలిసిన వాడే బ్రహ్మర్షి అని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు పిరమిడ్ మాస్టర్స్, గురువుల ధ్యాన ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీరామ్ గోపాల్ హనుమంతరాజ్ రాంబాబు, దామోదర్, సాంబశివరావు, నిర్మలా దేవి, లక్ష్మి, మాధవి, పిరమిడ్ మాస్టర్స్ స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-మామునూరు ఏసీపీ తిరుపతి**
**-ఏనుగల్లులో పోలీసుల కార్డెన్ అండ్ సర్చ్**



**పర్వతగిరి,23డిసెంబర్, (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మామునూరు ఏసీపీ తిరుపతి సూచించారు.సోమవారం పర్వతగిరి మండలంలోని ఏనుగల్లు గ్రామంలో పోలీసులు కార్డెన్ అండ్ సర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్ డిసిపి రవీందర్ పర్యవేక్షణలో మామునూరు ఏసిపి తిరుపతి ఆధ్వర్యంలో మామునూరు సబ్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సైబర్ క్రైమ్,గంజాయి,ఇతర నేరాల గురించి అవగాహన కల్పించారు.ఇందులో భాగంగా అర్హత పత్రాలు లేని 20 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.అదేవిదంగా అక్రమంగా మద్యం,పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్,ఎస్సై ప్రవీణ్,సిబ్బంది పాల్గొన్నారు.

# తలకొండపల్లిలో కల్యాణ లక్ష్మీ,షాదిముభారక్ చెక్కుల పంపిణీ

**-చెక్కుల పంపిణీలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**
**-బీదకుటుంబాల అభివృద్ధికి కృషి చేస్తాబీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**



**తలకొండపల్లి,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తలకొండపల్లి మండలంలో 78 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు.మండలంలో దేవకీ గార్డెన్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి,షాదిముభారక్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన హామీలకు కట్టుబడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలను ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీలో భాగంగా అమలు చేస్తున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.కల్వకుర్తి అభివృద్ధి ప్రాధికార కోసం నిరంతరం కృషి చేల్తునన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,నాయకులు తదితరులు ఉన్నారు.

# నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథం ను పరామర్శించిన మంద కృష్ణ



**హైదరాబాద్, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథంని పరామర్శించిన ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మరియు జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య. అనంతరం, మంద జగన్నాథం కూతురు డాక్టర్ పల్లవితో మాట్లాడారు. "డాక్టర్ జగన్నాథం ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాము," అని వారు తెలిపారు.

# ఆదిలాబాద్ నుండి వరంగల్ కు బస్ సర్వీస్ ప్రారంభం..

**ఆదిలాబాద్ జిల్లా డిసెంబర్ 23( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**




ఆదిలాబాద్ నుండి వరంగల్ వరకు ప్రత్యేక బస్సు సర్వీసును మంగళవారం నుండి ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ బస్సు ప్రతిరోజు రాత్రి 9 గంటలకు ఆదిలాబాద్ నుంచి బయలుదేరి ఉట్నూర్, జన్నారం, లక్షటి పేట్, కరీంనగర్ మీదుగా వరంగల్ కు ఉదయం 4 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు.అలాగే వరంగల్ నుండి ఉదయం 10 గంటలకు బయలుదేరి సాయంత్రం 5:15 అదిలాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీలో ప్రయాణం చేయలన్నారు.

# శ్రీ తేజ్ తండ్రిని పరామర్శించిన ఆర్యవైశ్య మహాసభ నాయకులు



**హైదరాబాద్, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పుష్ప 2 మూవీ తొక్కిసలాటలో గాయపడిన శ్రీ తేజ్ తండ్రిని కిమ్స్ హాస్పిటల్ లో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేష్ గుప్త, పొలిటికల్ కమిటీ ఛైర్మన్ చింతల రవి కుమార్ గుప్త, మహిళా అధ్యక్షులు ఉప్పల శారద, సామ్రాజ్య లక్ష్మీ, అగిరి వెంకటేశం, బిలకంటి కిరణ్, దండు రాం మోహన్, దండు రాహుల్ పరామర్శించారు. తాజా ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని, ఆయనకు త్వరగా కోలుకోవాలని ఆశిస్తూ వారి మద్దతు ప్రకటించారు

## 38వ ఆల్ ఇండియా లెవెల్ ఓపెన్ కరాటే అండ్ కుంగ్ ఫు ఛాంపియన్షిప్ పోటీలు

-కుంట్ల రామ్ రెడ్డి గార్డెన్ వేదికగా జరగనున్న ఛాంపియన్షిప్ పోటీలు
-జనవరి 5, 2025 ఆదివారం నాడు యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో కరాటే, కుంగ్ ఫు పోటీలు
-పాలమూరు ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా బ్రోచర్ విడుదలలి
-బ్రోచర్ విడుదల కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు వంశీకృష్ణ



**పాలమూరు,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జనవరి 5, 2025 ఆదివారం రోజు జరగనున్న 38వ ఆల్ ఇండియా లెవెల్ ఓపెన్ కరాటే మరియు కుంగ్ ఫు ఛాంపియన్షిప్ పోటీలకు సంబంధించిన బ్రోచర్ ను ఉమ్మడి పాలమూరు ఎంపీ డీకే అరుణ విడుదల చేశారు. స్వర్గీయ గ్రాండ్ మాస్టర్ మల్లేష్ యాదవ్ జ్ఞాపకార్థం, యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో 38వ ఆల్ ఇండియా లెవెల్ ఓపెన్ కరాటే మరియు కుంగ్ ఫు ఛాంపియన్షిప్ పోటీలు జరగనున్నట్లు చీఫ్ ఆర్గనైజర్ ఎస్. సాయినాథ్ తెలిపారు. ఇలాంటి ఇండియా లెవెల్ పోటీలు షాద్నగర్ పట్టణంలో నిర్వహించడం ఇదే ప్రథమమని, ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి కరాటే మరియు కుంగ్ ఫు శిక్షకులు, మరియు విద్యార్థులు హాజరుకానున్నట్లు, షాద్నగర్ బైపాస్ లోని కుంట రాంరెడ్డి గార్డెన్ వేదికగా ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చీఫ్ ఆర్గనైజర్ సాయినాథ్ తెలిపారు. బ్రోచర్ విడుదల కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు వంశీకృష్ణ, మాస్టర్ సాయినాథ్, ఉత్తేజ్ వినయ్ లు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం వేడుకలకు మద్యం పర్మిషన్ తప్పనిసరి

– ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్

**ఆమనగల్లు, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆమనగల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాలు (ఆమనగల్లు, కడ్తల్, తల్లకొండపల్లి, మడుగుల) లో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకునే అందరూ, ఫంక్షనల్సులో, ఫామ్ హౌసుల్లో, రిసార్ట్స్ లో తప్పనిసరిగా మద్యం పర్మిషన్ (ఈవెంట్ పర్మిట్) తీసుకోవాలని సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆదేశాలు జారీచేశారు. మద్యం పార్టీల్లో ఎన్డిపిఎల్,డిఫెన్స్ లిక్కర్, ఫారెన్ లిక్కర్ అనుమతించబడదు. మద్యం పర్మిషన్ చార్జెస్: ?9000/- (ఆన్లైన్ లో చెల్లించవచ్చు). ఈవెంట్ పర్మిట్ లేకుండా మద్యం పార్టీలు నిర్వహిస్తే చట్టరీత్య చర్యలు తీసుకోబడతాయని, ఎక్కడైనా గుడుంబా, నాటు సారాయి, బెల్లం, పట్టిక లాంటి సమాచారాన్ని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఆమనగల్ కు తెలియజేయగలరని సూచించారు. 8712658742 9000571671 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

– సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ మరియు టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా దుడ్డు కృష్ణ యాదవ్ ఇటీవలే నియమితులైన సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, "కార్యకర్తలందరినీ కలుపుకుని కలిసికట్టుగా పనిచేయాలి," అని కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, జంతుక రాజు, తోట శ్రీను, పాతకోట రాజు, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిమళించిన" మానవత్వం..!

-పేద విద్యార్థిని చదువుకు అయ్యప్ప స్వాముల ఆర్థిక సహాయం.!

**షాద్ నగర్,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



షాద్ నగర్ నియోజక వర్గ పరిధిలోని దేపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నర్సింలు మరియు సునీత దంపతుల కుమార్తె నవ్య షాద్ నగర్ పట్టణంలో కాకతీయ స్కూల్ లో పదవ తరగతి చదువుతోంది. పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఉన్నత చదువులను ప్రోత్సహిస్తూ సోమవారం శ్రీ ఆర్యనాథన్ గో సేవ అయ్యప్ప సమితి అద్వర్యం లో గురు స్వామి శ్రీశ్రీ సత్యనారాయణ రెడ్డి గురు స్వామి శిష్య బృందం 21వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు ఈ కార్యక్రమంలో స్వాములు శ్రీ శ్రీ సత్యనారాయణ రెడ్డి గురు స్వామి బి సాయిప్రసాద్ రెడ్డి స్వామి (బబ్లు ) బి.అనిల్ రెడ్డిస్వామి , సాయి స్వామి ,శివ స్వామి ,రాజవర్ధన్ రెడ్డి స్వామి ,మధు స్వామి అంజి, స్వామి కళ్యాణ్ స్వామి ,మహేష్ స్వామి ,తదితరులు పాల్గొన్నారు..

## అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన



**అచ్చంపేట, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణ పరిధిలో పార్లమెంటు భవనంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈరోజు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి కలిసి అచ్చంపేటలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా, ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ, "కేంద్ర మంత్రి అమిత్ షా 140 కోట్ల జనాభాకు తక్షణమే క్షమాపణ చెప్పాలని, వెంటనే మంచి పదవి నుండి తప్పుకోవాలని, లేదంటే ప్రధాన మంత్రి జోక్యం చేసుకొని బర్తరాఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం," అని అన్నారు. "బర్తరాఫ్ చేసేంతవరకు తమ పోరాటం ఆగదు," అని ఎంపీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మున్సిపాలిటీ చైర్మన్ గర్రపాటి శ్రీనివాసులు, పాతుకుల శ్రీశైలం, అంబేద్కర్ యువజన సంఘం డివిజనుల అధ్యక్షులు, కౌన్సిలర్లు కపిలవాయి శేఖర్, వెంకటేష్, శివశంకర్, కొంకి విజయ్, పేర్మల్ల పరమేష్, జిలకర మునీందర్, పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ లోని జిల్లల్లగడ్డ లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాల్లో బుష్ క్లియరెన్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. "హాస్టల్ వాటర్ ప్లాంట్ పరిశీలించి, ఎప్పటికప్పుడు ట్యాంకులు శుద్ధి చేయాలని," ఆయన ఆదేశించారు.

## మెడికల్ కళాశాలలో పోస్టులకు అర్హులు ఎవరు...?

-ఎమ్మెల్యేలు, మంత్రుల రికమెండేషన్ మీదనే అభ్యర్థుల ఎంపిక జరిగిందా...?
-రికమండేషన్ తో అర్హులైన విద్యార్థులకు మొండి చేయి...



**నర్సంపేట డిసెంబర్ 23**
నర్సంపేట మెడికల్ కళాశాల లో పారామెడికల్ పోస్టులకు అర్హులు ఎవరనే సందేహం నెలకొంది.... పోస్టుల విషయంలో స్థానిక ఎమ్మెల్యేలు మంత్రుల రికమండేషన్ మీద అభ్యర్థుల ఎంపిక జరిగినట్లు చర్చనీయాంశంగా మారింది... వివరాల్లోకి వెళితే వరంగల్ జిల్లా నర్సంపేటలో నూతన మెడికల్ కళాశాలలో ఔట్సోర్సింగ్ లో 64 ల్యాబ్ టెక్నీషియన్, ఆపరేషన్ అసిస్టెంట్, ఈసీజీ టెక్నీషియన్ మరియు 23 విభాగాల్లో నోటిఫికేషన్ జారీ చేశారు. 64 పోస్టులకు గాను 4,000 మంది అభ్యర్థులు అప్లై చేశారు. మెరిట్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు దక్కాల్సిన పోస్టులు రాజకీయ అండదండలతో నింపుతున్నారని సమాచారం.... స్థానిక కలెక్టర్ అర్హులైన పేద విద్యార్థులకు దక్కాల్సిన ఉద్యోగాలు దక్కకుండా ఉంటున్న చూస్తూ ఊరుకోవడం మంచిది కాదని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర బీసీ మెంబర్ బొల్లంపల్లి సారయ్య , వరంగల్ జిల్లా అధ్యక్షులు బస్కే నాగరాజు, వరంగల్ ప్రధాన కార్యదర్శి జన్ను అనిల్ కుమార్, స్టేషన్ ఘన్ పూర్ అధ్యక్షులు జలగం ప్రవీణ్, వర్ధన్నపేట కార్యదర్శి శ్రీధర్ లు కలెక్టర్ కు సోమవారం మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరిట్ ఆధారంగా అభ్యర్థుల సెలక్షన్ చేసిన వాళ్ల పూర్తి వివరాలు ఆన్లైన్లో పొందుపరిచాలని డిమాండ్ చేశారు.

## వంగూర్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వంగూర్, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూరు మండలంలో ఈరోజు డిసిసి అధ్యక్షులు మరియు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో కల్చరల్ మీటింగ్ హాల్ మరియు వెలుములపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ తో పాటు, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ దేశినేని పండిత్ రావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. అయన, "వీలైనంత తొందరగా పనులను పూర్తి చేయాలి," అని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, మండల నాయకులు, జిల్లా నాయకులు, సంబంధిత అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శీల వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించిన మట్ట వెంకటయ్య గౌడ్



**వెల్దండ, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండలంలో ఈరోజు శీల వెంకటయ్య గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెల్దండ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మృతుని కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, ఎండి రషీద్, ఎండి ఖలీల్, కొయ్యల పుల్లయ్య, కిష్టాలు, శీల శీను, సాయిబాబు, మట్ట భరత్, నాగార్జున, భయ్యా సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు



**అచ్చంపేట, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణ పరిధిలో తెలంగాణ క్రిస్టియన్ కార్పొరేషన్ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుపుకునే సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరై, క్రిస్టియన్ సంఘాల నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సెమి క్రిస్మస్ వేడుకల్లో ఆర్డీవో మాధవి, క్రిస్టియన్ సంఘాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్.బి.నగర్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ఎల్.బీ.నగర్, డిసెంబరు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్.బీ.నగర్ లో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ స్థితిగతులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిశీలించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ హాస్పిటల్ వెయ్యి పడకలతో జీం13 గా మొత్తం 14 ఫ్లోర్లలో నిర్మాణం జరుగుతుంది. 900 కోట్ల రూపాయలతో పనులు చేస్తున్న ఎల్ టీ కంపెనీ నిర్మాణ డిజైన్ రూపొందించిన ప్రముఖ ఆర్చిటెక్ట్ కంపెనీ ఆస్కార్ పొన్ని ఆర్కిటెక్ట్స్. పనుల నాణ్యతను పరిశీలనకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంపెనీ బ్యూరో వెరిటాస్ ప్రయివేట్ లిమిటెడ్ ను ప్రభుత్వం నియమించింది.

# పాలమూరు..రంగారెడ్డి పూర్తి చేయలేని రేవంత్ రెడ్డి పొడుగు పొడుగు మాటలు ఎందుకు

-జూపల్లికృష్ణారావుని ఉత్తుత్తి ప్రగల్భాలు

-పార్టీలు మారినంత మాత్రానా చేసిన అభివృద్ధి నిజం కాకుండా పోతుందా

-యాసంగికి సాగునీళ్ళు లేవు అనడం ప్రభుత్వ అసమర్థత

- మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి



వనపర్తి,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్) :
పాలమూరు..రంగారెడ్డి పూర్తి చేయలేని రేవంత్ రెడ్డి పొడుగు పొడుగు మాటలు ఎందుకని...ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి అన్నారు.సోమవారం నిరంజన్ రెడ్డి తన స్వగృహంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90శాతం పాలమూరు రంగారెడ్డి పనులు పూర్తి చేసిన,10శాతం పూర్తి చేయలేని అసమర్థత ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని దుయ్యబట్టారు.సాగునీరు కోసం,రైతు రుణమాఫీ కోసం,రైతు భరోసా కోసం రైతులు పడుతున్న కష్టాలు కళ్ళకు కట్టినట్లు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వివరించారు.యాసంగి సీజన్ లో ఉమ్మడి పాలమూర్ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు ఎలా ఇవ్వాలన్నదే నీటి పారుదల శాఖ మంత్రి బాధ్యత తీసుకుని నీళ్లు ఎన్ని ఉన్నాయి, ఎంత స్టోరేజ్ ఉంది అని రైతులకు ముందే తెలిపాలని అన్నారు.రికార్డ్ స్థాయిలో వర్షాలు పడ్డాయని..35 రోజులు పాటు ఏడతెరిపిలేని వర్షాలుపడి పైనుండి వరద రావడం వల్ల దాదాపు 25-30 టిఎంసిల నీళ్ళు సముద్రం పాలు అయ్యాయని మండిపడ్డారు.నీళ్లు ఎలా ఒడిసి పట్టుకోవాలో తెలియదు కానీ,ఇరిగేషన్ బోర్డ్ సమావేశం పెట్టకుండా ఒక డిప్యుటీతో ప్రకటన ఇప్పిస్తారని విమర్శించారు.జూరాల లో నీళ్లు లేవు కాబట్టి యాసంగికి నీళ్ళు ఇవ్వలేమని, రామన్ పాడు వరకు మాత్రమే నీళ్లు ఇస్తామనీ చెబుతున్నారని.. ఇది ఎంతవరకు సమంజసం అని అన్నారు.జూరాల నుండి కొడంగల్ కు ఎత్తిపోతల పథకం వేస్ట్ అని ఆలోచన రహితమన్నారు.కేసీఆర్ మొదలు పెట్టిన పని నుండి నీళ్లు ఇస్తే పేరు వస్తుందని, పట్టుదల అవసరం లేదు ప్రజల పక్షాన ఆలోచన చేయాలన్నారు. కేసీఆర్ అంచనా ప్రకారం పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు, భీమా ద్వారా 2 లక్షలు, కోయిల సాగర్ ద్వారా 40 వేలు,కొడంగల్ లిఫ్ట్ కాకుండా 6 లక్షల ఎకరాలకు నీళ్ళు ఇవ్వొచ్చు అని వివరించారు.ప్రభుత్వ అసమర్ధత వల్ల వరద నీళ్ల లేకపోతే యాసంగికి నీళ్లు ఉండవు అని విమర్శించారు.పక్క నియోజకవర్గంలో ఫోటోలు పెట్టుకునే సంబరం తప్ప జూపల్లికి ప్రజలకు మంచి ఆలోచన చేయాలన్న ఆలోచనే లేదన్నారు.ఉత్తమ్ కుమార్ ఉత్తిత్తి మాటలు... గతంలో జూపల్లియే చెప్పాడని,1984 నుండి 2004 కల్వకుర్తి పథకం మీద కేవలం రూ.12 కోట్లు ఖర్చు పెట్టారని, బిఆర్ఎస్ లో ఉన్నప్పుడు 100 సార్లు మాట్లాడారని...కేసీఆర్, హరీష్ రావు వల్లనే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి నీళ్లు ఇచ్చారని ఎన్నో సార్లు జూపల్లి చెప్పారని అన్నారు. కానీ ఇప్పుడు జూపల్లి బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని అంటున్నారని,ఇస్తే రాజీనామా చేస్తావు అన్నారు కదా రాజీనామా మీ విజ్ఞత కు వదిలిపెడుతున్నామని అన్నారు.బిఆర్ఎస్ పార్టీలో ఉండి మంత్రి పదవులు అనుభవించినప్పుడు తెలియదా?అప్పుడు ఎందుకు రాజీనామా చేయలేక పోయావని,ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి వెళ్లి మంత్రి పదవి వచ్చిన తరువాత ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదు అని చెప్పడానికి సిగ్గు అనిపిస్తలేదా... అని ఘాటుగా మాజి మంత్రి.నిరంజన్ విమర్శించారు.2016లో అప్పటి నీటి పారుదల శాఖమంత్రి హరీష్ రావు వచ్చినప్పుడు అప్పటి మంత్రి జూపల్లి మాట్లాడిన వీడియో నిరంజన్ రెడ్డి మీడియా ముందు చూయించారు.గత ప్రభుత్వం హయాంలో పాలమూర్ పంటలకు నీళ్లు అందిచలేకపోవడం వల్ల పంటలు పండక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.20 ఏండ్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న మీరు కాంగ్రెస్ లో ఉంటే పని జరిగినట్లు? లేకపోతే వేరే పార్టీలో ఉంటే పనులు కానట్లు మాట్లాడడం అంటే జూపల్లికి కొంచెమైన ఇంగితం ఉండాలి కదా అని మండిపడ్డారు.జొన్నలగడ్డ రిజర్వాయర్ వద్ద అప్పటి మంత్రి జూపల్లి మీడియా సమావేశంలో మాట్లాడిన వీడియోతో అది గత పాలకులు నీళ్ల ఇవ్వలేదని ప్రస్తుతం చెబుతున్నారు కదా?గత ప్రభుత్వంలో మంత్రిగా వెలగబెట్టిన మీరు అసమర్తులు అన్నట్లా అని ఎద్దేవా చేశారు.రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని,పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు ఎంత మేలు చేసాము అన్నది ముఖ్యమన్నారు.మంత్రిగా నీవు ఉన్నప్పుడు,నేను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ఉండి అందరు కలికి కదా పని చేసి నీళ్లు ఇచ్చాము.. ఇప్పుడు పార్టీ మారితే నిజాలు అబద్దాలు అవుతాయా అని విమర్శించారు.కల్వకుర్తి ఎత్తిపోథల పథకంలో వనపర్తి నియోజకవర్గం లేదు,అయిన ఒప్పించి నీళ్ళు తెచ్చామని అన్నారు.గొంతులు తెగిన పరవాలేదు..తెలంగాణ కోసం కొట్లాడినం అని చోట మోట నాయకులతో మాట్లాడితే ఎక్కడ ఎవరు బెదరరు అని విమర్శించారు.12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక బిఆర్ఎస్ ఎమ్మెల్యే కలిసి పాలమూర్ రంగారెడ్డి ఎత్తిపోతుల పథకం టన్నెల్, రిజర్వాయర్ లను పరిశీలన చేయాలని..ఏం చేస్తే ప్రజలకు నీళ్లు ఎలా అందించాలో ఆలోచన చేయకుండా నీళ్లు అడిగితే బట్టలు ఉడగొడుతాం అంటారా?పాలన చేస్తున్నారా లేక రౌడీ ఐజం చేస్తున్నారా అని ప్రశ్నించారు.రాష్ట్ర ఆదాయం ఎంత?అప్పు ఎంత అని వనరులు ఎట్లా పెంచుకోవాలని చూసుకున్నాక ఎన్నికల హామీలు ఇవ్వాలని,నోటికి వచ్చినట్లు హామీలు ఇవ్వకూడదని హితవు పలికారు.ఈ సమావేశములో బి.లక్ష్మయ్య,వాకిటి శ్రీధర్,కురుమూర్తి యాదవ్,కృష్ణా నాయక్,ఎద్దులకరుణశ్రీ,వనం రాములు,విజయ్ కుమార్,పృథ్వీరాజ్, జనార్థం నాయుడు, తిరుపతయ్య, బాలరాజు, నందిమల్ల అశోక్, మాణిక్యం, చంద్రశేఖర్,జాత్రూ నాయక్,రాజశేఖర్,దిలీప్ రెడ్డి,మతీన్,చిట్యాల రాము,సునీల్ వాల్మీకి,రమేష్,మంద రాము తదితరులు పాల్గొన్నారు.

# సమయానికి రక్తదానం చేసిన యువశక్తి ఫౌండేషన్

-రక్తదానం ప్రాణదానం. యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొబ్బూరు నవీన్




వనపర్తి,26 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్) :
వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ఆపరేషన్ కోసం సుధా నర్సింగ్ హోమ్ హాస్పిటల్ లో అడ్మిట్ అవ్వడంతో అతనికి బ్లడ్ చాలా తక్కువగా ఉంది వెంటనే అతనికి బి పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలని డాక్టర్స్ నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొబ్బూరు నవీన్ సంప్రదించగా వెంటనే మానవత్వంతో స్పందించి రక్తం ఇప్పించడం జరిగింది. కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ కి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుబ్బూరు నవీన్, ఫౌండేషన్ మెంబర్ బాలకృష్ణ, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## పట్టపగలే తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ...

-18.5 తులాల బంగారం దోపిడీ..





షాద్ నగర్,డిసెంబర్ 23(నీలగిరి ఎక్స్ ప్రెస్ ):
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఆశా కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో పట్టపగలే దొంగతనం జరిగింది యజమాని శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... భవనం మొదటి అంతస్తులో ఉంటున్న వారి ఇంట్లోని కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా, శ్రీనివాసరెడ్డి ఉదయం 8:30 కు ఇంటికి తాళం వేసి డ్యూటీ కి వెళ్ళాడు. రాత్రి 8 గంటలకు వచ్చి చూడగా ఒక రాడ్డు సహాయంతో తాళాన్ని బద్దలు కొట్టి బీరువాలో దాచి ఉంచిన 18.5 తులాల బంగారాన్ని చోరీ చేసినట్లు తెలిపారు. 100 కు డయల్ చేయగా పోలీసులు వచ్చి పరిసరాలను పరిశీలించి, క్లూస్ టీమ్ తో పరిశీలిస్తున్నారు..

# వకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకోవాలి

-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్):
రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం, వారి భవిష్యత్తు కోసం ఎంతో వెచ్చిస్తోందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. వసతి గృహ విద్యార్థినిలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన బ్లాంకెట్లను, స్వెటర్లు, రింగ్ బాల్స్, చెస్ మెటీరియల్స్, సహా పలు ఆట వస్తువులను పంపిణీ చేశారు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాల్ని, ఈ సదుపాయాలను చక్కగా వినియోగించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డించడానికి ముందు సూపర్వైజర్లు తినాలని, ఆ తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. హాస్టల్లో స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేసిన కలెక్టర్, మెస్ కమిటీ ఉందా అని సిబ్బందిని అడిగారు. వసతి గృహానికి వంట సామాగ్రి వచ్చినప్పుడు స్టాక్ రిజిస్టర్లో విద్యార్థులచే కచ్చితంగా సంతకం చేయించాలని సూచించారు. తప్పనిసరిగా మెస్ కమిటీ ఉండాలని విద్యార్థులు తమకు వచ్చే ఆహార పదార్థాలు వాటి సామాగ్రిపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. వంట సామాగ్రి వచ్చినప్పుడు అది నాణ్యతగా ఉందో లేదో చెక్ చేసిన తర్వాతనే దించుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మల్లికార్జున్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాల పెంపును కృషిచేయాలి

వనపర్తి జిల్లా విద్యాశాఖ ఐ ఈ కోఆర్డినేటర్ యుగంధర్



వనపర్తి,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల , కె డి ఆర్ నగర్ వనపర్తిని సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ యుగంధర్. నాలుగో తరగతి మరియు 5వ తరగతి విద్యార్థుల యొక్క గణిత మరియు ఆంగ్ల భాష సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు జాలి ఫోనిక్స్ యాక్టివిటీస్ ద్వారా ఇంగ్లీష్ అక్షరాలను, పదాలను పలకడం, చదవడం రాయడం నేర్పిస్తున్నారు. తరగతిలో మెజారిటీ విద్యార్థులు ఇంగ్లీష్ చదవడం రాయడం చేస్తున్నారు. ఉపాధ్యాయులందరూ ఎఫ్ ఎల్ ఎన్ ప్రకారము బోధన చేయాలని విద్యార్థుల యొక్క సామర్థ్యాలు పెంపుకై కృషి చేయాలని తెలిపారు తెలిపారు.


## ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

డాక్టరేట్ పొందిన బచ్చు రాము



వనపర్తి,23 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం శాయశక్తుల కృషి చేస్తానని బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనపర్తి లోని వాసవీ భవన్ లో సోమవారం సామాజిక సేవలో డాక్టరేట్ పొందిన బచ్చు రాముకు అభినందన సభ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు మాట్లాడుతూ రాజకీయంగా బచ్చురాం ఎదగాలని, అందుకోసం ఆర్యవైశ్య సంఘం పూర్తి సహాయ సహకారాలు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం యువజన సంఘం అధ్యక్షులు బచ్చు వెంకటేష్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు దేవరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అమర రాజా బ్యాటరీ కంపెనీ భవనంలో అగ్నిప్రమాదం



(నీలగిరి ఎక్స్ ప్రెస్): -శంషాబాద్
శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో నిర్మాణంలో ఉన్న అమరరాజా బ్యాటరీ కంపెనీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దాంతో కార్మికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీశారు. పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమర రాజా బ్యాటరీ కంపెనీ నిర్మాణంలో ఉంది. ఇందులో సుమారు 150 మంది కార్మికులు పనిచేస్తున్నారు. సోమవారం ఒక్కసారిగా మూడో అంతస్తులో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దాంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు. వెంటనే పోలీసులకు, అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.